# అభాగ్య జీవులు

రచన :
రావిళ్ల. కృష్ణారావు

★

ఆమె సెకండరీగ్రేడు ట్రైనింగ్ ప్యాసైంది. ట్రైనింగ్ కాలేజీ లెక్చరర్, గర్ల్స్ హాస్టలు వార్డెనూ అయిన సుశీలానాయుడామె కృషి నభినందించింది. "మీ మేలు యీ జన్మలో మరచిపోలేనండీ" అని బరువుగా చేతులెత్తి నమస్కరించింది ఆమె. నేత్రద్వయాలు ముత్యాల్లాంటి కన్నీటి బిందువుల రాల్చాయి.

"పిచ్చిపిల్లా! జీవితమంటే పరిమళ పుష్పాలతో కూడిన ఉద్యానవనం కాదని తెలుసుకో. ఆవేశాలూ, ఉద్రేకాలూ ఎక్కువ విచారాన్నే కలుగజేస్తాయి కాని వచ్చిన ఆపదను యుక్తిగా తప్పింపలేవు సరిగదా పరిష్కార మార్గాలకు ప్రతిభందకాలవుతాయి. అలా బాధపడకు. భగవంతుడు నీ కుజ్వలభవిష్యత్తు ప్రసాదించాలని ఆకాంక్షిస్తున్నాను" అంది లెక్చరర్ సుశీలా నాయుడు. ఆమె శలవు గైకొని రైల్వేస్టేషన్ వేపు సాగిపోయింది. ఇన్స్పెక్టరాఫ్ స్కూల్సు ఆఫీసులో అప్లికేషన్ పడేసి...

అంత పెద్ద పెంకుటింట్లో డెబ్బయ్యేళ్ళవృద్ధురాలు తప్ప యింకెవరూ లేరు. ఆ 'లోగిలి' పూర్వమాసం సంసారమెంత ఉచ్ఛస్థితిలో నున్నదో తెలుపుటకు, ప్రత్యక్షసాక్ష్యం. యిల్లంతా బూజుపట్టి వుంది. ఆమె గుమ్మంలో కాలుపెట్టగానే, సావిట్లో నున్న కుక్కిమంచంలో పరున్న వృద్ధురాలు లేచి తేరిపారజూచి "నా తల్లీ వచ్చావా అమ్మా సునందా! రా! నా బంగారు తల్లీ! వడివడిగా దాపునకొచ్చిన సునందను కావలించుకుంది ముసలామె...

ఆ వృద్ధురాలిపేరన్న పూర్ణమ్మ కూతురు. ఒకప్పుడది బాగా—ఆ గ్రామంలోకల్లా తల మానికంగా, బ్రతికిన కుటుంబం. సునంద తండ్రిని శీతారామయ్యగారు నాలుగేళ్లయింది పరలోక గతుడయ్యి. అప్పటినుండీ ఆ తల్లీ కూతుళ్ల బాధలన్నీ యిన్నీగావు.

శీతారామయ్యగారికి దివ్యమైన యిల్లూ, పదెకరాల మాగానీ, పెద్దతోట, నాల్గుకాండ్ల ఎడ్లు నాలుగు పాడిగేదెలు వుండేవి. వారికి సునంద కాక, సునీతి అనేమరొక కూతురుండేది. సునీతి, సునందకన్న అయిదేళ్ళు పెద్దది.

సునీతికి పన్నెండవ ఏటనే "తాహతుకు తగ్గ విధంగా పెద్ద ఎత్తున పెళ్లిచేశాడు వైభవోపేతంగా! ఆడంబరంగా చేసేటప్పటికి అయిదెకరాల మాగాణీ హరించి పోయింది, కేవలం కట్నం కోసమే! అలక. ప్రధానం తదితర లాంఛనప్రాయ ఖర్చులు, సోపనపు ఖర్చులు కలిపి మరి నాల్గేళ్ళకు తోటకాస్తా స్వాహా అయింది. అప్పటికి సునందనకు పదకొండేండ్లు.

శీతారామయ్యగారు సునీతి నేదో సెకండు ఫారం దాకా చదివించి కొద్దిగా శాస్త్రీయ సంగీతం నేర్పించాడు. కానీ, సునందను మాత్రం మెట్రిక్యులేషన్ వరకూ చదివించాలని అనుకున్నాడు. శీతారామయ్యగారు ముక్కుకు సూటిగా పోయేమనిషి. స్వతహాగా చాలా ఉత్తముడు, సాటివారిలో గౌరవంగా బ్రతక నేర్చినవాడు.

మర్యాద, గౌరవించటంలోనూ అతడు సాటివారికేమాత్రం తీసిపోయేవాడు గాడు. పరువు ప్రతిష్ట కోసరమని ఆయన ఆస్తికిమించిన అప్పు చేయలేదు. కానీ తాహతుకు మించిన ఖర్చు చేశాడు. "భవిష్యత్తు గురించి కాస్తా ఆలోచించండి. పెళ్ళిగాని పిల్లదుంది. మనమున్నాము. మన జీవితకాలమంతా వాళ్ళని సంతోష పెట్ట గలిగినపుడే మనము వాళ్లు సంతోషంగా మన గలుగుతారు. లేకపోతే ఆచార్లయ్యగారన్న సామెత మాదిరే అవుతుంది. ముందు నేతి

బుక్కలు, అనక నీటిబుక్కలు" అని అనేది. శీతారామయ్యగారు నవ్వి వూరుకునే వాడా మాటలు విని.

శీతారామయ్యగారు సునందను హైస్కూల్లో చేర్పించాడు. సునంద తెలివిగల పిల్ల. అధ్యాపకులు బోధించే విషయాల్ని యిట్టే అర్థం చేసుకోగల శక్తి ఆమెకుంది. ధీమతి. అందుచేతనే ఆమె మెట్రిక్యులేషన్ ఫస్టుక్లాసులో పాసైంది.

మెట్రిక్యులేషన్ పరీక్షా ఫలితాలు వార్తాపత్రికల్లో ప్రకటించబడి మూడు దినాలైంది. ఆ మూడు దినాలూ సునంద, విందులూ, వినోదాలలోనూ స్నేహితురాండ్ర మధ్యనే గడపింది. ఉన్నట్టుండి ఒకనాడు టెలిగ్రాం వచ్చింది. సమయానికి సీతారామయ్య గారింట్లో లేరు. సంతకం చేసి టెలిగ్రాం అందుకుంది సునంద. అసలు టెలిగ్రాం వచ్చినందులకే ఆశ్చర్యపడింది. తమకు యింత అర్జంటు టెలిగ్రాం ఎవరుయిచ్చి వుంటారని టెలిగ్రాం చూస్తూ సునంద కుప్పలా కూలిపోయింది.

"నాగుపాము కరచి సునీతి చనిపోయి"దని వుందందులో, అంతే, మరు నిముషంలో బజారు వెళ్ళిన శీతారామయ్యగారు వచ్చేశారు. కూతురి చేతిలోని టెలిగ్రాం చూచి బావురు మన్నాడు. ఆ కుటుంబఘోష వర్ణించటం కష్టతరమే మరి. దుఃఖించి సీతారామయ్యగారు తెప్పరిల్లారు. మగవాడు కాదూ మరి! మూనాళ్ల వరకూ పచ్చి మంచినీళ్లయినా ముట్టిందికాదు అన్నపూర్ణమ్మ. ఆమె మాతృహృదయం ఎంతో సంక్షోభానికి గురయింది. యీ హడావిడిలో సునంద ఏమైందీ తెలుసుకున్నవాళ్లు లేరు. కంటికీ మంటికీ ఏకధారగా కన్నీరు కారుస్తూ తన గదిలోనే వుండిపోయింది సునంద అక్కతో గడిపినరోజుల జ్ఞప్తికి దెచ్చుకుంటూ...

యథావిధిగా అంత్యక్రియలు జరిపించి పదిహేనవ నాటికల్లా యిల్లుచేరాడు సీతారామయ్యగారు. అయిదారువేల కట్నంపోసి సైకిలూ, గడియారం, రేడియో ఒకటేమిటీ అన్నీ శక్తికొలది యిచ్చి ఘనంగా పెళ్లిచేస్తే...ఆమె పచ్చిగా చేసే సంసారాన్ని నయనారవిందంగా వీక్షించకముందే కనీస తొలిమురిపమైనా తీరక ముందే యిలాంటి దౌర్భాగ్యం సంప్రాప్తించినందులకు ఆ కుటుంబ మెంతగానో వగచారు. రానురాను అంతా క్రమంగా కోలుకోసాగారు.

వేసవి శలవులై పోయాయి. సూల్సు, కాలేజీస్ ఓపెన్ చేశారు. సునంద కాలేజీలో చేరుతానంది. స్కాలర్‌షిప్ వస్తుంది. కాలేజీఫీజు మాఫీకాగా బోర్డింగులో కనీస మాఫ్‌షిప్ అయినా దొరుకుతుందంది. కానీ శీతారామయ్యగారందు కంగీకరించ లేదు.

"నన్నాకట్టే బాధ పెట్టకుతల్లి! నే నెంతవరకు చదివించాను" పూర్తికాకముందే,

"అదికాదు నాన్నా..." ఏదో అనబోయింది సునంద. కానీ శీతారామయ్య గారామెకవకాశ మీయలేదు. "ఏదీకాదు. నేనూ, అమ్మా నీ శ్రేయోభిలాషులమని గుర్తించుకో. అక్కయ్య మరణమే నన్ను మానసికంగా పూర్తిగా దిగజారజేసింది. యిక నువ్వుకూడ మా కండ్లముందుండకపోతే యీ ముసలి ఘటాలెలా బ్రతకాలి తల్లి!" శీతారామయ్యగారి కనుకొలకుల్లో నీళ్లు నిలిచాయి. గాద్గికంగా కూతురివేపుచూస్తూ అన్నాడు. లోపలికి పీక్కుపోయిన చంపలమీది నుండి కన్నీటి కణాలు పడలేక క్రిందపడ్డాయి. తండ్రిని పరిస్థితి నర్థం చేసుకున్న సునంద ముందు చదువుగురించి యింకేమీ అడగలేదు. చదువు కంతటితో స్వస్తివాచకం పలకటం ఖాయమనుకుంది. ఆ మాటే తండ్రితో అనేసింది. శీతారామయ్యగారు ఏమీ అనలేదు.

సునంద శరీరంలో వసంతం ప్రవేశిస్తూంది. ఆమె మనస్సులో మన్మథుడు ప్రవేశిస్తున్నాడు. ఆమె పెళ్లీడు కొచ్చింది. తగిన సంబంధంచూచి

వివాహంచేసి తన బాధ్యత నెరవేర్చుకొన దలచాడు శీతారామయ్యగారు. వరాన్వేషణలో పాదరక్ష లరిగేటంత వరకూ తిరిగాడు. చివరికో సంబంధం ఖాయమైంది. ఖర్చు పూర్తిగా అంచనా వేసుకున్నారు ముసలి వారిద్దరూ. పెళ్లికి అన్ని ఏర్పాటులూ సిద్ధం చేయించసాగారు.

ఉన్న అయిదెకరాలూ అమ్మక తప్పలేదు. ధర సంతృప్తికరంగానే పలికింది. సునంద వివాహం వైభవోపేతంగా జరిగింది........ కొత్తగా అత్తవారింటికెళ్లింది సునంద. సునంద అత్తవారు బాగా డబ్బున్నవారు. అయినా యింట్లో చిన్నపని మొదలుకొని-యింటివాళ్లే చేసుకుంటారు. కనీసం కసువు వూకే మనిషయినా లేదు. సునంద అత్తవారింటివద్ద సుఖపడలేదు. భర్తతో కులాసాగా కులకలేదు. తెలతెలవారుతుండగా లేవటం పశువుల పేడ తీయటం, కసువూకటం, కళాపీవేయటం, అంట్లుతోమటం, వంట, ఆడబిడ్డ పిల్లలకు నీళ్లు పోయటం, దువ్వటం, అందరికీ వడ్డించటం, తిన్న కంచాలు కడగినాక నోట్లో బొగ్గునేసుకొనేది. ప్రొద్దు పడమరవాటు వాలాక యింత కవళం తినేది. తిరిగి అంట్లుతోమి, పిల్లలకి పగటన్నాలు పెట్టి వంటచేసేటప్పటికి సాయంత్రమయ్యేది. అందరికీ వడ్డించి తానింత తిని అన్నీ సర్దేవరకల్లా సరిగ్గా పది కొట్టేది. భర్త అదోలా వుంటూ ఆమెను పలకరించేవాడు కాదు. ఆమె నతడు పరాయి మనిషిగా చూడటం ఆమె కెంతో బాధ కలిగించింది. ఎన్నటూ యింటిపట్టు నుండేవాడు కాదు.

సునంద అప్పుడే కన్నుమూసింది. ఇంతలో తలుపు చప్పుడైంది. "ఎవరూ?" అంది మగతగా సునంద. అస్తమానూ చాకిరితో అలసిపోయింది గావును.

"ఊ! తలుపు" అండవతలి కంఠస్వరం; అది భర్త కంఠస్వరమని గుర్తించింది.


సునంద తలుపు తెరచింది. తలుపు తెక్కలు తెఱచుకోగానే సారాయి వాసన సునంద నాసికా రంధ్రాల్లోకి దూసుకుపోయింది. ఛీ! పాడుకంపు. అనుకుందామె. సునంద కింతవరకూ తెలియదు, భర్త యిటువంటివాడని. అతనెన్నడూ ఆమెను లాలనగా పలకరించిన పాపాన పోలేదు. సునంద లోలోన ఎంతగానో వ్యధ చెందింది. కానీ తన బాధను ఎప్పుడూ పైకి వ్యక్తం కానీయదు.

"కాసిని మంచినీళ్లు కావాలి. ఆ గదిలోకి... పో...యి..." అతను పూర్తి చేయలేకపోయాడు. స్పృహతప్పి పడిపోయాడు. నోటి గుండనురగలు రావటం మొదలయినాయి. సునంద హడలిపోయి అత్త గదివైపు పరుగెత్తుకునిపోయింది.

క్రమంగా రోజులు, వారాలు, నెలలు గడుస్తున్నాయి. సునంద కచ్చటి పరిస్థితి అంతా అర్థమైంది. భర్త త్రాగుబోతు, మూర్ఛలరోగి. అత్త పిసినారి; మామ జూదరి, రంఢీబాజ్... యిట్టి వాతావరణాన్ని భరించలేకపోయేది సునంద. నల్లగా, దోముడికిన ముఖం, గుడ్లగూబ కళ్లలాటి కళ్లు, భయంకరపు స్వరూపాలు— ఎవ్వర్ని తలచుకున్నా ఆమె హడలిపోయేది. అయినా ఆమె యివేవీ పుట్టింటికి తెలియపరచలేదు. భగవంతునిమీద భారంవేసి తన పని తను చేసుకుపోసాగింది. వ్యథాకులితమైన జీవితం ఒక్క సంవత్సరము కేవలం పన్నెండు నెలలు కాల గర్భంలో లీనమైనాయి.

జూదంలో ఆస్తినంతా తగలెట్టేశాడు మామగారి మనోవ్యధతో అత్త మంచంపట్టి మరణించింది. జూదంలో దెబ్బలాడగా పోలీసులు మామను కటకటాల్లోకి పంపించారు. పొల్లుకూతలన్నీ కూసి ఆమె భర్త సునందను తృణీకరించాడు...

సునంద పుట్టిల్లు చేరింది. మాతృమూర్తి



"ఆడపెత్తనం" చిత్రంలో అంజలి, నాగేశ్వరావు

నవనీతమైన హృదయము విపరీత సంక్షోభానికి గురైంది. ఈ దుర్వార్త విన్న శీతారామయ్య గారు నిలువునా నీరైనారు. కలిగిన యిద్దరు సంతానంలో ఒకరు చనిపోగా వున్నదాని స్థితి యీవిధంగా పరిణమించెనని ఎంతగానో దుఃఖించాడు శీతారామయ్యగారు. గతజీవిత స్మృతులు అతన్ని మానసికంగా చాలా గట్టిదెబ్బ తీశాయి. వ్యధాకులిత హృదయావేదనతో మంచం పట్టాడు. తల్లీ, కూతురు యిదిచూసి ఎంతగానో తల్లడిల్లిపోయారు. వారిలో కలిగిన భయాందోళనలు అన్నీ యిన్నీ గావు. మనోవ్యధతో వున్న శీతారామయ్యగారిని మందులు రక్షించలేదు. ఆర్నెల్లు తిరక్కముందే "హరీ" మన్నాడు. ఆ అభాగ్యజీవులు దిక్కులేని పక్షులయ్యారు.

సునంద స్నేహితురాలొకామె ఆమెను ట్రైనింగ్ కాలేజీ లెక్చరర్, సుశీలానాయుడుగారికి పరిచయం చేసింది. ఆమె సునంద పరిస్థితినంతా మనసుకు పట్టించుకుంది. సాయపడతానని వాగ్దానం చేసింది. బ్రతికి చెడ్డవారంటే ఆమె కెక్కడలేని జాలి!

సునందకు, సుశీలానాయుడు ధైర్యం చెప్పింది. అభాగ్యజీవుల యెడల ఆమె తన అభిప్రాయాలను చెప్పింది. స్త్రీ జనోద్ధరణ యెడల ఆమె కెంత పట్టుదల, ఆసక్తిగలదో అర్థమైంది సునందకు. ఆమె వూరడింపులతోనూ, సానునయ వాక్యాలతోనూ సునంద తన "గత చరిత్రను" పూర్తిగా విస్మరించసాగింది. ట్రైనింగ్ కాలేజీలో చేరిందామె. హాస్టల్‌లో ఉచిత భోజన వసతి కల్పించింది. సునంద ఆమె కెంతగానో కృతజ్ఞత తెలిపింది. భవిష్యత్తుమీద ఆశ కలిగింది.


సునంద విశేషకృషి చేసింది. ఆమె పఠనా దీక్షను గాంచిన సుశీనాయుడుగారెంతో సంబరపడ్డారు. సునంద ట్రైనింగ్ పాసైంది. సుశీలానాయుడుగారివద్ద శలవు తీసికొంది.

ఆమె చిన్నది కాకపోయినా పసిపిల్లలా తల్లి ఒడిలో వాలిపోయింది. ఎన్నెన్నో స్మృతు

లామె మనసు కకావికలు చేశాయి. ఆమె తన మనస్సును కకావికలు కానీక గుండె దిటవు చేసికుంది. పట్టుదల నేమాత్రం సడలనీ లేదు.

కూతుర్ని చూడగానే అన్నపూర్ణ హృదయం విచ్చుకొంది. ఆ ఆనందాతిరేకంలో గత జీవిత బాధలు మరచిపోయింది. ఆ విచ్చుకున్న హృదయాని కామెను హత్తుకుంది. ఇద్దరి కనుకొలకుల్లోనూ ఆనంద బాష్పాలు మెరిశాయి. వారి హృదయాలు నిండైన ఆనందాన్ని పొందినాయి. యిద్దరూ మనసులువిప్పి మాట్లాడుకున్నారు.

బయట పోస్ట్‌మేన్ కేక వినిపించింది. సునంద వెళ్లి ఒక గోధుమరంగు కవరు తీసికొని లోపలికొచ్చింది.



" ఆడపెత్తనం" చిత్రంలో అంజలి, పెరుమాళ్లు

తల్లి సరసనే కూర్చుని కవరు విప్పింది. ఇంటర్వ్యూకు పిలుపు వచ్చింది. తల్లి ఆశీర్వాదాన్నందుకొని సెలక్షన్సు కెళ్లింది...... వారంరోజులు గడిచాయి.

అపాయింట్‌మెంట్ ఆర్డర్ రానే వచ్చింది. బస్తీలోని మాధ్యమిక బాలికా పాఠశాలలో సహోపాధ్యాయురాలుగా వేశారు. ఆనాడు వారికి పర్వదినం. ఆనందం పట్టలేక సువార్తను నలుగు రమ్మలక్కల చెవిలో వేసిందన్నపూర్ణ. కొందరు సంతసించారు. మరికొందరు దాన్ని గురించి విడ్డూరంగా వ్యాఖ్యానించారు. అయినా తల్లీకూతు లైవన్నీ ఖాతరు చెయ్యలేదు...ఆమె చార్జీ తీసికొంది. విద్యార్థినులమధ్య ఆమెకు క్షణక్షణమూ హాయినే ప్రసాదిస్తూంది. తెలుగు టీచరుగా ఆమె తన విధ్యుక్తధర్మాన్ని సక్రమంగా ఆచరించింది. త్వరలోనే ఆమెకు మంచి పేరు వచ్చింది. విద్యార్థినుల కామె అంటే ఎంతో గౌరవం ఏర్పడింది. దినాలు, వారాలు, మాసాలు గడుస్తున్నాయి.

వారి కిప్పు డేలోటూ లేదు. అయినా ఆమె ఎందుకో సంపూర్ణానందంతో ఉండలేకపోతూంది. తనలో తన్ను ఏదో ఫలానా అని చెప్పలేని

అస్పష్టశక్తి అలజడి పెడుతూంది. ఆ అలజడి కామె తట్టుకోలేకపోవటం అసహజం కాదు!

ఆమె యవ్వనం అడివిగాచిన వెన్నెల్లా పరిణమించటం ఆమె సంపూర్ణానందంతో ఉండలేకపోవటానికి కారణమేమో!—! తన్ను అలజడి పెట్టే ఆ అజ్ఞాత శక్తితో సతమతమవుతూనే ఆ సంవత్సరం గడిపింది. వేసవి శలవులు వచ్చాయి. కూతురు బలవంతంమీద వేసవిలో కూడ బస్తీలో ఉండ నిశ్చయించుకున్నారు. ఈమధ్య నొకసారి ఆమె సుశీలానాయుడుగారిని కలిసి వచ్చింది పట్నం వెళ్లి.

ఉదయం పదిగంటలైంది. భోజనాలయ్యాక, సునంద సోఫాలో కూర్చుని స్వెట్టర్ అల్లుకుంటోంది. ముసలామె చాపమీద కూలబడింది. పట్నం విషయాలు చెబుతూ చెబుతూ, "ఎల్లుండి సుశీలానాయుడుగారు మనింటి కొస్తారమ్మా!" అంది.

"సరి! అన్ని ఏర్పాట్లూ చూడు మరి!" అందామె.

ఒక సంవత్సరం క్రితంనుంచీ సునంద అత్తింటి వారి జాడలు తెలియరాలేదు. ఇంచుమించు ఆ కుటుంబమంతా నశించిపోయిందనే భావించారు అంతా. వీళ్లూ అదే అనుకున్నారు. అయినా యిప్పుడూ వాళ్లకూ, తనకూ ఏవిటి సంబంధం? కొన్నాళ్లుగా ఆ విషయాన్నే—విస్మరించారు. అందుకే సునంద యిదివరకు నాయుడుతో తన భర్త మరణించినట్లు చెప్పింది.

"ఏమండీ బామ్మగారూ!..." ప్రారంభించింది సుశీల నాయుడుగారు.

"ఏంతల్లి!" అంద ముసలామె.

"నే!నొచ్చి మూడుదినాలైంది. ఏసంగతి చెప్పకపోతిరే!"

"ఏంచెప్పమంటావుతల్లినన్ను! నీకు తెలియనిదేముందమ్మా! కూతురి సుఖాన్ని కోరని తల్లి ఎవరు? నీ వింతవరకూ మాకింత అండగా నిలవబట్టే మేము యిప్పుడీ స్థితిలోనైనా ఉండగలిగాము—మా బ్రతుకు ఓ మార్గం చూపించిన దానవు. నీవూ సునందకు పూజ్యురాలవే. నీ కుచితరీతియని తోచిన ప్రకారము—సునంద ఇష్టప్రకారము ఎలా నడచినా ఫర్వాలేదు. నాకూ సంతోషమే. అయినా యీ మాట వార్ని అడగాల్సింది. వారే వుంటే నా చిట్టితల్లి స్థితి మరోవిధంగా వుండేదేమో! చచ్చి స్వర్గాన ఉన్న వారు సునందను మనసారా ఆశీర్వదిస్తారు! ఇంక నన్నేం చెప్పమంటావుతల్లీ!" భర్త జ్ఞాపకానికి రాగానే ఆమె హృదయం అల్లల్లాడిపోయింది. దుఃఖభారంతో ఆమె నోట మాట సరిగా పెగల్లేదు. కళ్లు రెండూ అశ్రుపూరితాలైనాయి.

ఆమె కాస్త తెప్పరిల్లిందాకా తాళింది సుశీలాదేవి. ఆమె వూరడిల్లాక తిరిగి "మీ కిదివర కొకసారి చెప్పినట్లు జ్ఞాపకం. అతను హైస్కూల్లో టీచరు. వయస్సు ఇరవై ఎనిమిది. కానీ చూచుటకు పాతికేళ్ల కంటే ఎక్కువుండ వనిపిస్తుంది. భార్య చనిపోయి రెండుసంవత్సరాలైంది. పిల్లా పీచూ లేరు, నెలకు నూటయాభై రూపాయల జీతం. మనిషి అందంగా వుంటాడు. మీరు సరేనంటే సునంద కక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయించొచ్చు. విధవ వివాహాలు శాస్త్ర సమ్మతమని ఆధునికులంతా అంగీకరిస్తున్నప్పుడు మీ కభ్యంతరమేమిటి? అందులోనూ సునందలాంటి యువతి అలా వుండటం..."

"భావ్యంకాదని నాకూ తెలుసునమ్మా! మీ యిష్టమే నా యిష్టమని చెప్పాముకాదా!" అంది ముసలామె. సుశీలాదేవి సంతోషించింది.

"సునందా!" పిలిచింది అన్నపూర్ణమ్మ.

"అక్కయ్య ఏమంటూందో తెలుసా! నాకిలాంటి వాట్టే అర్థంకావు. మీ రిద్దరూ మాట్లాడుకోండి. నే వెళతాలే పొయ్యిపద్దకు" ఆమె వంటగదిలో కెళ్లిపోయింది.

"ఏం సునందా! నీవుకూడ అతణ్ని చూచావుగా! ఏమంటావు!" అంది. సునంద యింతవరకూ ఆమె కేమీ చెప్పలేదు. బాధ్యతంతా తల్లి మీదే వేసింది. తల్లి తన కేమీ తెలియదని మీ యిష్టప్రకారం ఎలా నడచినా సంతోషమే అని అనేసింది. యిక సునందదే ఒప్పందం కావాల్సివుంది. సునంద కాలేజీలో జేరేటప్పుడు తన భర్త మరణించినట్లు చెప్పింది. వాస్తవాని కత డేమైంది తెలియదు.

సునంద ఎన్నిసార్లో అనుకుంది. తన భర్త చనిపోయిందీ లేనిదీ తనకు నిజానికి తెలియదనీ, వాస్తవ కథ యిదియనీ చెబుదామని అనుకుంది. కానీ ఆమెకు ఎందుచేతనోగాని స్పష్టపరచలేక పోయింది సునంద. చనిపోయివుంటారని అనుకున్నారు తల్లీకూతుర్లు. అదేరీతిగా చనిపోయినట్లు చెప్పేసిందామె. కానీ నిజంచెప్పి సలహా తీసుకుందా మనుకున్న సునందకు ధైర్యం చాలటంలేదు. అందుచేతనే ఆమె సుశీలా నాయుడు కేమీ చెప్పలేకపోతూంది. తటపటా యిస్తున్న సునందను "ఏం సునందా! ఏదో తటపటాయిస్తున్నావ్. చెప్పు. నాదగ్గర నీకు దాపరికమెందుకు. అతను నచ్చలేదా? లేక నీ మనసులో యింకా ఎవరైనా వున్నారా? చెప్పు. ఎలాగూ నీవూ సుఖపడాలనేకదా మేం కోరుకునేది?"

"నా మనసులో యిం కెవరూ లేరు."

"మరి యితనంటే యిష్టంలేదా?"

"ఇష్టంకాక కాదు. కానీ...." నోట మాట పెగల్లేదు.

"కానీ......" అంది సుశీలాదేవి.

"........" చెప్పలేకపోయింది సునంద.

"అయితే యిష్టమేనన్నమాట. మరి కానీ లేదు, అర్ధనాలేదు. చెప్పేందుకు సిగ్గుపడుతున్నావా? మంచి నెక్లెస్ కావాలేమిటి? ఓ! అతను చాలా మంచివాడు. చేయిస్తాడులే" బహు తేలిగ్గా అనేసింది. సునంద నామె కేమి ప్రత్యుత్తర మీయలేదు. మౌనం అంగీకారసూచకంగా గ్రహించింది సుశీల; కా కేం చేస్తుంది!

సునందకు ఆనందరావుతో వివాహమైంది. శలవుల్లో అంతా కలసే వున్నారు. సునంద కాపురము పచ్చగా సాగిపోతోంది. ఆమె కిప్పు డేలోటూ లేదు. ముసలమ్మ ఆనందానికి మేర లేదు. కూతురూ, అల్లుడూ చిలుకాగోరువంకల్లా వుండటం చూసి ఆమె ఎంతగానో మురిసి పోయింది. జనతా టాకీసులోకి "హెలెన్ ఆఫ్ ట్రాయ్" వచ్చిందని విన్నారు. ఆనందరావా సాయంత్రం వెళ్ధామన్నాడు. కానీ సాయంత్రం అతనికి వీలుగాలేదు. బాల్యస్నేహితునికి కొన్ని కార్యాలయపనులు చేయించాల్సి వచ్చింది. సినిమా మర్నాడికి వాయిదా పడింది. బయటికి పోయి తిరిగి వచ్చే ఆనందరావును ఆమె గుమ్మంలోనే కలుసుకుని లోనికి తీసుకుపోయేది. వారి అనురాగము చూచిన ప్రతివారికీ అసూయ కలక్క మానదు.

సినిమాచూచి బయటి కొచ్చారు దంపతు లిరువురూ. అల్లంతదూరాన వున్న రిక్షావాడొ కడు "రిక్షాహై నా సాబ్!" అనుకుంటూ దగ్గరకు వచ్చాడు. గండుముఖం—ముఖంలో మచ్చలు. నల్లగా, లావుగా, బొద్దుగావున్నాడు. ఎవరీతడు? తనెప్పుడో చూసినట్టుంది, అనుకుంది సునంద.

వాడూ సునందన నదేపనిగా చూస్తున్నాడు. సునందకు భయమేసింది క్షణంలో వాడికళ్ళు ఎర్రబడ్డాయి. అయినా వాడు తన చూపులు మరల్చి తిరిగీ రిక్షాహైనాసాబ్!" అన్నాడు. ఇద్దరూ రిక్షా ఎక్కారు. రిక్షా ఎక్కారన్నమాటే గాని సునందభయ విహ్వలఐంది. ఆనందరావు పిక్చర్‌ను గురించి ఏమేమో చెబుతున్నాడు. కానీ అవేమీ ఆమె మనసు కెక్కటంలేదు. అచేతనురాలై అందులో కూర్చుని వుంది. రిక్షా

వాడప్పు డప్పుడూ వెనక్కు తిరిగిచూస్తున్నాడు. వాడిచూపులు వాడితూపుల్లా ఆమెకు షాక్ తిని పించేస్తున్నాయి.

సినిమాకెళ్ళి వచ్చిందాదిగా ఆమె ఎందుకో విచారంగా వుండజొచ్చింది. మనిషిలో మునపటి ఉత్సాహం గాని కాంతిగాని లేదు. ఎప్పుడూ ఏదో దీర్ఘంగా ఆలోచించేది. ఆనందరావు కొకటి రెండుసార్లు అనుమానంవేసి "సునందా! ఏమిటలా నీరసంగా వుంటున్నావు. మునుపటి ఉత్సాహం, కళా నీలో లేదు. నాతో చెప్పవూ!" అని లాలనగా అడిగేవాడు. ఆ అమృతమూర్తి లాలనలో ఆమె కరగిపోయేది. "ఏం లేదండీ!" అనేసి కిలాకిలా నవ్వేది. ఆ నవ్వులోనూ మునపటి అందం, ఆకర్షణ చిందటం లేదనేవాడు రావు. కానీ ఆమెను గట్టిగా అడగతలచుకోలేదు. అడిగితే ఆమె మరీ నొచ్చుకుని యింకా నీరసించి పోతుందని అతనికి తెలుసు.

చిరునవ్వు చిందులాడ్తూ కళకళలాడే ఆ ముఖసీమలో విచారం కారుమేఘాల్లా కన్పట్టజొచ్చింది. ఎంత ప్రయత్నించినా ఆమెలోని రావు ఏమిటో అతని కర్థం కావటం లేదు. సునందను చూస్తూ అతను మానసిక సంక్షోభానికి గురైనాడు. కానీ అని సుశీలానాయుడు తన్ను పృచ్ఛించి నపుడు తనెందును చెప్ప లేదు! కనీసం తల్లి అయినా చెబితే ఎంత బాగుండేది. ఆ పవిత్ర మాతృమూర్తి తను చెప్పిందనుకుని వుండవచ్చు. తరచిచూస్తే తప్పెవరిదీ కాదనిపిస్తూంది. భవిష్యత్తులో రాబోయే పరిణామాల్ని ఊహించుకుంటూంటే ఆమె శరీరం ఒక్కోసారి కంపించి పోయేది. ఆమె మానసిక వ్యధ నెవ్వరూ అర్థం చేసుకోలేక పోయారు. 'ముదిమి' అన్న పూర్ణమ్మను కృశింప చేసింది. ఆమె శరీరం పిండు శారి పాలిపోయి ముడుతలు పడింది. చెంపలోపలికి పీక్కుపోయాయి. పళ్లూడి పోయాయి. తల నెరిసి పోయింది. మంచం దిగనంతవరకూ వచ్చి వచ్చి...ఓనాడు హరీమంది.

తల్లి చావుతో సునంద మరీ కృశించిపోయింది. ఆనందరావు శక్తివంచన లేకుండా ప్రయత్నించాడు కారణ మేమిటని సంపూర్ణాత్మాభిమానంతో తనతో చెప్పమని అడిగాడు. కానీ సునంద చెప్ప లేక పోయింది. అమాయకమైన, ఆనందమయమైన అతని ముఖంలోకి చూస్తూ ఆమె ఏమీ చెప్ప లేకపోయేది. తను పడేదికాక పైగా అతన్నికూడా...ఆలోచించ లేకపోయింది.

ఆనందరావు అర్జంటు పనిమీద ప్రక్కన పద్దెనిమిది మైళ్ల దూరంలోనున్న స్నేహితునింటికి వెళ్లాడు, టెలిగ్రాంవస్తే. మర్నాడు సాయంత్రం నాలుగు గంటలకల్లా తిరిగి వచ్చాడు. గుమ్మంలోంచే ఆహ్వానించే అందాల బరిణె యీ దినం గుమ్మంలో నిలబడ లేదు. గుమ్మమంతా చిన్న బోయినట్టుంది. సునందక్కడ నిలబడకపోతే అసలా ప్రాంతానికే కళ తప్పినట్లనిపించిందానందరావుకు. సునంద బయటికి రాకపోవటానికి కారణమేమిటా అని తలపోస్తూ గుమ్మంమెట్లెక్కాడు. ఆనందరావులో కంగారు బయల్దేరింది. అన్ని గదులూ గాలించి అతను సామానులున్న గదికెళ్లాడు. స్టూలుమీద కవరు. దూలానికి వేళాడబడివుంది సునంద. సునంద శరీరంలో ప్రాణం లేదు. అతని కీ ప్రపంచమంతా శరవేగంతో పరిభ్రమిస్తున్నట్లనిపించింది. కవర్ను విప్పాడు భారంగా.

"పూజ్యులైన భర్తగారికి,

పవిత్రహృదయులైన మిమ్ము విచార సాగరంలో ముంచి వెళుతున్నందుకు నాకు బాధగానే వుంది. మిమ్ముల అన్యాయంచేసి వెళ్తున్నందులకు భగవంతుడు నా కక్కడకూడా శిక్ష విధించుగాక! అభాగ్యుల కెక్కడైనా యిడుములే. నా మానసిక వ్యధ ముందు మీ యెడల చేసే అపచారాన్ని నిగ్రహించుకోగల దీ శక్తి.

మనోదార్ఢ్యత నాలో లేవు. నేనో అబలను. అబలలు, స్త్రీలు కాదు సబలులేనని రుజువు చేయగల శక్తి నాలో లేదు

నా భర్త చనిపోయాడని నేను మీతో చెప్పాను. నేను అలా అనుకొనిమాత్ర మేమీ అందరితోటి చెప్పటం జరిగింది. కాని అతడు చనిపోలేదని మొన్న మనం "హెలెన్ ఆఫ్ ట్రాయ్" కెళ్లాక తెలిసింది. పిక్చరు చూసివస్తూ రిక్షాలో వచ్చామే ఆ రిక్షావాడే నా మొదటి భర్త. అతనితో నే నిదివరకు సంసారం చేసిన మాట నిజం! కానీ దాంపత్యసుఖం తెలయని జీవితం! ఏపాప మెరుగనన్నా యీ లోకం క్షమిస్తుందన్న ఆశ లేదు. పైగా వ్రేలెత్తి చూపుతూ సూటిపోటి మాటలలో హృదయన్ని గాయపరుస్తుంది!

నా మొదటి భర్త త్రాగుబోతు. మొదట బాగా ఉన్న సంసారం. రాను రాను అన్నీ హేయకార్యాలకు, దురభ్యాసాల కాలవాల మైపోయిందా కొంప. జూదంలో ఆస్తిపోయి మామ జైలుపాలయ్యాడు. అత్త మరణించింది. నీచుడూ, నపుంసకుడూ అయిన నా భర్త నన్ను నానామాటలూ అని వెళ్లగొట్టాడు. పుట్టిల్లు చేరుకున్నాను విధిలేక.

మాది మొదట బాగా బ్రతికిన కుటుంబం. మా నాన్నగారికి నేనేకాక సునీతి అనే మరొక కూతురుండేది. ఆమె నాకన్న ఐదేళ్లు పెద్దది. ఎంతో ఆడంబరంగా వివాహం చేశాడు ఆమెకు నాన్నగారు. ఆమె కాపురాన్ని కన్నులపండువుగా చూడకముందే ఆమె సర్పవాతబడింది. దానితో మా నాన్నగారు మానసికంగా చాలా క్షీణించారు.

నాకు వివాహం చేశారు. కానీ "వారి" కుటుంబపరిస్థితులు మాకు మాత్రం ఎలా తెలుస్తాయి. నే నెన్ని బాధ లనుభవించినా అవేవీ మా పుట్టింటికి తెలియపరచలేదు...నా రాక చూచి, పరిస్థితులన్నీ అర్థంచేసుకుని, యిద్దరు సంతానమైతే యిద్దరి జీవితాలు లక్ష్యసిద్ధిగాక ముందే అంతమైనందులకు చాలాయిదైపోయారు మా నాన్నగారు.

సుశీలానాయుడుగారి దయవలన నాకు భవిష్యత్తుమీద ఆశ కనిపించింది. ఆతర్వాత మా అత్తగారింటి పరిస్థితు లేలా మారినాయో వా రేమైపోయారో మాత్రం తెలియదు. చనిపోయారని లేచిన వదంతులబట్టి అందరితోటీ చనిపోయినారని చెప్పాము.

నా మొదటిభర్త నన్ను గుర్తించాడు. రిక్షా తొక్కుతూ కొరకొరమని అతను చూచినప్పుడల్లా హడలిపోయేదాన్ని, అసలు అతను అప్పుడే నలదీసి అడుగుతాడనుకున్నాను. కానీ అడగలేదు. అతనికి కావలసింది నేను కాదు. నే నెందుకు? డబ్బుకావాలి. అతడు మర్నాడువచ్చి రహస్యం బట్టబయలు చేస్తానన్నాడు. దాంతో నేను హడలిపోయి కొంత డబ్బిచ్చి పంపించాను. తిరిగి సాయంత్రం ప్రత్యక్ష్యం నే నతణ్ని కాళ్లావేళ్లా బతిమాలుకున్నాను. కానీ ఆ నరరూప రాక్షసుడు కఠిన హృదయుడు. పాషండుడు వినలేదు. మీరు గ్రామాంతరం వెళ్లినదినం వచ్చి వందరూపాయ లిమ్మని కూర్చున్నాడు. సతాయించి సతాయించి సాధించుకుపోయాడు.

ఇలా నేనన్నాళ్ళని ఎంతని డబ్బు అతని కివ్వగలను? యీ రోజు వంద అడిగినవాడు రేపు వెయ్యి అడుగుతాడనుకోటంలో ఆశ్చర్యమే ముంది చెప్పండి? అందుచేత యిది ఎప్పుడో ఒకప్పుడు బయటపడక మానదు. అప్పుడు మీరెలా మారిపోతారో, భర్త చనిపోయాడని మోసం చేసినానని మీరూ తృణీకరిస్తే నా బ్రతుకేం కాను? యీ అభాగ్యురాలు ఏం చెబితే అప్పుడెవరు నమ్ముతారు?!

అంతులేని ఆలోచనలతో నా మనస్సు కకవికలై పోయింది. ఎన్ని విధాల యోచించినా యిక నాకు జీవించాలని ఆశ కలగలేదు. భవిష్యత్తులో ఒక్క ఆశాకిరణం కూడ కనపడలేదు. గాఢ తమ

స్సులు అలుముకొని వున్నట్టు తోచింది. ఎట్టకే
లకు కన్నవారిని కలుసుకోవటమే సర్వత్రా శ్రేయ
స్కరమనిపించింది. అందుకోసమే వాస్తవమంతా
రాశాను. యీ అభాగ్యురాలు మిమ్ములనూ
అభాగ్యునిగా చేసి వెళ్తున్నందులకు క్షమించండి.
మరణించబోయే అబల అబద్ధమాడదను సంగతి
మరువకండి. మిమ్ముల విచారంలో వదలిపోతున్న
పిరికి పందను ఒక్కసారి క్షమించాననండి. అపుడే
నా ఆత్మకు శాంతి. మరుజన్మంలో నైనా మీకు
సేవజేసే భాగ్యం కలుగుగాక! ఇక శాశ్వత శలవు
వేడుతూ,

మీ చరణదాసి,
సునంద.

ఆనందరావు కళ్లల్లోంచి జలజలమంటూ కన్నీరు కారసాగింది. అతని గుండె చెఱువయింది. 'సునందా' అంటూ దూలాని కేళ్లాడబడి వున్న శవాన్ని కౌగిలించుకున్నాడు అంతే.


## చేతిపనుల వర్తక రహస్య బోధిని

50 రూపాయలనుంచి 500 రూపాయలవరకు నెలకు సంపాదించవచ్చును. ఇందు సబ్బు దినుసులు, సెంట్లు, అత్తరు, హేరాయిల్స్, పప్పరమెంట్సు, వార్నిష్, వర్ణములు, పన్నీరు, షర్బత్తు, ఊదువత్తులు, కర్పూరం, సిరా దినుసులు, గిల్టుయిచ్చే విధము, ఫోటో ఎత్తువిధము, బాణాసంచా మందులు మొదలుగునవి సులభముగా తయారుచేయు పద్ధతులతో 100 పేజీలు గల పెద్ద పుస్తకము వెల రు. 1-8-0, పోస్టు ఖర్చు 10 అణాలు.

వినోదం బుక్ డిపో,
32, క్రిష్ణప్పనాయక్ టాంకు వీధి, మదరాసు-1.



